క్లుప్తంగా

అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి


సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే పాయం

మణుగూరు టౌన్: నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం సీఎంను కలిసి సన్మానించారు. తొలుత భద్రాచలం సీతారామచంద్రస్వామి ప్రసాదం అందజేసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌ను కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరణ


శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

మణుగూరు రూరల్: మణుగూరు మున్సిపల్ కమిషనర్‌గా యాదగిరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శ్యామ్ కుమార్, మధు, నరేందర్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై దృష్టి

అశ్వారావుపేటరూరల్: నేరాల నియంత్రణ, శాంతిభద్రత పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని పాల్వంచ డీఎస్పీ ఆర్.సతీష్ కుమార్ అన్నారు. బుధవారం అశ్వారావుపేట సర్కిల్ కార్యాలయంలో వార్షిక తనిఖీలు చేశారు. ముందుగా స్టేషన్ నేరాల సంబంధించిన రికార్డులను సమగ్రంగా తనిఖీ చేశారు. అనంతరం సర్కిల్ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. సీఐ కరుణాకర్, ఎస్సైలు యయాతి రాజు, శివరామకృష్ణ, సాయికిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ చోరీ

గుండాల: సెల్‌ఫోన్ చోరీకి గురైన ఘటన మండలంలోని సాయనపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి బైక్‌పై బట్టలు అమ్మడానికి వచ్చిన ఓ వ్యక్తి తాటి కృష్ణ ఇంటి వద్ద బట్టలు అమ్ముకుంటూ కృష్ణ ఫోన్ పక్కన పెట్టడాన్ని గమనించి దొంగిలించాడు. అది గమనించిన కుటుంబ సభ్యులు వ్యక్తిని వెంబడించగా జామరగూడెం వద్ద బైక్‌తో పాటు బట్టల మూట వదిలేసి పరారయ్యాడు.

సమస్యలు పరిష్కరించాలి

మణుగూరు రూరల్: మండలంలోని అశోక్‌నగర్‌లో గల ఎస్సీ బాలుర హాస్టల్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం హాస్టల్‌ను సందర్శించి వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, వారిపై దురుసుగా ప్రవర్తించిన వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సత్రపల్లి సాంబశివరావు సరోజిని, జ్యోతి, సువర్ణ, రాజు, సమ్మక్క, నరసింహారావు, చంద్రయ్య పాల్గొన్నారు.

నిశితంగా సర్వే చేపట్టాలి..

దుమ్ముగూడెం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మొదలుపెడుతున్న ఇంటింటి కుటుంబ సర్వేను నిశితంగా చేపట్టాలని తహసీల్దార్ అశోక్‌కుమార్ సూచించారు. బుధవారం గంగోలు గ్రామంలోని వీవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఇంటింటి కుటుంబ సర్వేపై ఎన్యుమేటర్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... ప్రతీ ఇంటిలో సమగ్రంగా సర్వే చేపట్టాలని ఆ కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలను పూర్తి చేయాలన్నారు. ఎంపీఓ రామకృష్ణ, గిర్దావర్‌లు వెంకటేశ్వరరావు, నరసింహారావు, జీపీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: సమగ్ర కుటుంబ సర్వేపై అశ్వారావుపేట రైతువేదికలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో సర్వే చేసే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం సర్వే చేసే సిబ్బందికి అవసరమైన సామగ్రిను అందించారు. ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎంపీవో సోయం ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మణుగూరు టౌన్: సర్వే నిర్వహణ కార్యక్రమంలో భాగంగా అధికారులు తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావులు ఎన్యుమరేటర్లకు సర్వేపై అవగాహన కల్పించారు. ఈవోఆర్డీ పల్నాటి వెంకటేశ్వర్లు, ఏపీఎంఓ అహ్మద్ సిబ్బంది పాల్గొన్నారు.

కరకగూడెం: మండలంలోని భట్టుపల్లి రైతువేదికలో ఎన్యుమరేటర్, సూపర్‌వైజర్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కుమార్, అధికారులు, శిక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ములకలపల్లి: మండలకేంద్రంలోని రైతువేదికలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సర్వేలో చేపట్టాల్సి అంశాలపై ట్రైనర్స్ శంకర్, ఏసు దుర్గాప్రసాద్ వివరించారు. తహసీల్దార్ గుడ్ల పుల్లారావుఎంపీఓ లక్ష్మయ్య, ఆర్ఐ భద్రు, ఏఎస్ఓ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.


దుమ్ముగూడెంలో శిక్షణ కార్యక్రమం..


అశ్వారావుపేటరూరల్: శిక్షణలో మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణ ప్రసాద్


మణుగూరు టౌన్: అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ రాఘవరెడ్డి


కరకగూడెంలో..


ములకలపల్లిలో..

సమస్యల పరిష్కారానికి కృషి..

- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

దమ్మపేట: సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జారేను బుధవారం అశ్వారావుపేట పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు కలిసి కమ్యూనిటీ భవనం, శ్మశానవాటిక స్థలం తదితర అంశాలపై వినతిపత్రం అందజేశారు. వెలుగుజాకబ్, కుమార్, సాధు రమేష్, సుజీవ రాజు, కుంజా కిరణ్, సాల్మన్ పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల వినతి..

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో అర్హత ఉన్న ముస్లింలకు అవకాశం కల్పించాలని, మైనారిటీ సంఘం తరపున ఎమ్మెల్యే జారేకు వినతి అందజేశారు. శిథిలావస్థలో ఉన్న షాదీఖానాలు, మసీదుల పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి, సమస్యలను పరిష్కరించాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. సర్దార్, గఫార్, దస్తగిర్, జానీమియా, హబీబ్, బాజీ ఉన్నారు.


ఎమ్మెల్యే జారెకు వినతిపత్రం అందజేస్తున్న మైనార్టీ నాయకులు



డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి


విద్యార్థులతో ఎమ్మెల్యే తెల్లం, ఉపాధ్యాయులు

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కరించి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఓరియంటేషన్, ఐటీసీ నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జాన్ మిల్టన్, ఐటీసీ పీఎస్‌పీడీ హెచ్‌ఆర్ మేనేజర్ చెంగల్‌రావు, వైస్ ప్రిన్సిపల్ హవీలా, బూసిరెడ్డి శంకర్ రెడ్డి, వి.కామేశ్వరరావు, తోటమల్ల బాలయోగి, సోముల గిరి ప్రసాద్, వెంకట్ రెడ్డి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

లక్ష్మీనారాయణ కల్యాణం

చంద్రుగొండ: మండలకేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి కల్యాణం ప్రధాన పూజారి వీవీఆర్‌కే మూర్తి ఆధ్వర్యంలో బుధవారం శాస్త్రోక్తంగా జరిపించారు. సంకా కృపాకర్, కుక్కడపు నర్సింహారావు, కుక్కడపు రామారావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. మాజీ జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలు జయప్రదం చేయండి

అశ్వారావుపేటరూరల్: ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్ని జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ నాయకులు ఎస్‌డీ సలీం కోరారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వేడుకల్ని గురువారం అశ్వారావుపేటలో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. రామకృష్ణ, పఠాన్ జలాల్, విజయ్‌కాంత్ పాల్గొన్నారు.

నర్సిరెడ్డి గెలుపునకు కృషి చేయాలి

భద్రాచలంటౌన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డి గెలుపు కృషి చేయాలని యూటీఎఫ్ నాయకుడు పి.లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బుధవారం జరిగిన సమావేశంలో నర్సిరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ పోస్టర్లు ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి విజయకుమార్, టీపీఎస్ ప్రసాద్, వెంకటేశ్వర్లు, రాజ శ్రీనివాస్, సంగం శ్రీనివాస్, టి.రమేష్, ఎం.రమేష్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

మునగ సాగు చేయండి

అశ్వారావుపేటరూరల్: వరి,పత్తి పంటలకు ప్రత్యామ్నాయంగా మునగ, వెదురు పంటలను సాగు చేయాలని జాతీయ ఉపాధి హామీ ఏపీఓ కె.రామచంద్రరావు కోరారు. బుధవారం మండల పరిధిలోని తిరుమలకుంట గ్రామంలోగల రైతువేదికలో సన్న, చిన్నకారు రైతులకు మునగ, వెదురు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఏఓ శివరాం ప్రసాద్, ఏఈవోలు, ఐకేపీ సీసీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

బీఆర్‌ఎస్ పోరాట ఫలితమే విద్యుత్ చార్జీల తగ్గింపు

పినపాక: బీఆర్‌ఎస్ పార్టీ పోరాట ఫలితంగానే విద్యుత్ చార్జీలు తగ్గించారని పార్టీ మండల అధ్యక్షులు పగడాల సతీష్‌రెడ్డి అన్నారు. బుధవారం ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో పార్టీ నాయకులకు స్వీట్లు తినిపించి సంతోషాన్ని వ్యక్తం చేశారు. మాజీ ఎంపీపీ గుమ్మడి గాంధీ, వెంకటేశ్వరెడ్డి, కొండేరు రాము,బత్తుల వెంకటరెడ్డి, సత్యనారాయణ, షేక్ జాంగీర్, ముక్కు నాసర్ రెడ్డి, చిట్టిమళ్ల సాంబశివరావు, అంకిరెడ్డి పాల్గొన్నారు.

ఆలయంలో ఆర్డీఓ పూజలు

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ) : మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి, భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి ఆలయాలను కొత్తగూడెం ఆర్డీఓ డీ.మధు బుధవారం సందర్శించారు. స్వామి వారి సన్నిధిలో పూజలు చేశారు. ఆయన వెంట ఆర్ఐ మధు పాల్గొన్నారు.

దొంగ సొత్తు కొంటే చర్యలు

చంద్రుగొండ : దొంగసొత్తు కొనుగోలు చేస్తే చట్టపర చర్యలు తీసుకుంటామని ఎస్సై గంజి స్వప్న హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆమె సిబ్బందితో కలిసి పాత ఇనుప షాపులను తనిఖీ చేశారు. దొంగలించిన ఇనుము, ఇతర సామగ్రి తీసుకువచ్చే వారి సమాచారం ఇవ్వాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

భోజన కార్మికుల ధర్నా

అశ్వారావుపేటరూరల్: మధ్యాహ్న భోజన వంట కార్మికుల వేతనాలు తక్షణమే విడుదల చేయాలని స్థానిక ఎమ్మార్వో కార్యాలయం వద్ద బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ మాట్లాడుతూ.. పెరుగుతున్న మార్కెట్ ధరల ప్రకారం మెనూ ఛార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. ధర్మల సీతారాములు, నాగదుర్గ, సీత, పద్మ, రమాదేవి, వెంకమ్మ పాల్గొన్నారు.



వాహనాల తనిఖీ

కరకగూడెం: మండలంలోని పలు గ్రామాల్లో కరకగూడెం ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో బుధవారం ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రతీ వాహనదారుడి ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల మేరకు రోడ్లపై ప్రయాణించాలన్నారు. అంతేకాకుండా విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. అనంతరం నిబంధనలు అతిక్రమించిన పలువురు వాహనదారులకు ఈచలాన్ ద్వారా జరిమానా విధించారు.

ఏరియాలో 83 శాతం బొగ్గు ఉత్పత్తి

మణుగూరు టౌన్: అక్టోబర్ మాసంలో మణుగూరు ఏరియాలో 83 శాతం బొగ్గు ఉత్పత్తి, ఓబీ వెలికితీత లక్ష్యం 87 శాతం సాధించామని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ తెలిపారు. బుధవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. అక్టోబర్ నెలలో 11.16 లక్షల టన్నులకు గాను 9.30 లక్షల టన్నులు బొగ్గు ఉత్పత్తి సాధించామన్నారు. ఏప్రియల్ నుంచి అక్టోబర్ వరకు రైలు, రోడ్, రోప్ ద్వారా 9.22 లక్షల టన్నులు తరలించామన్నారు. వర్షాల ప్రభావంతో గతనెలలో బొగ్గు ఉత్పత్తి లేకపోవడంతో ప్రస్తుతం రోజుకు 45 వేల టన్నులు అదనంగా తీయాల్సిన పరిస్థితి ఉందని లక్ష్య సాధనను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుని వార్షిక లక్ష్యాల సాధనకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో అధికారులు శ్యాంసుందర్, వెంకట్రావ్, శ్రీనివాస్, సలగల రమేశ్, శేషగిరి, సింగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్సుల నిర్వహణకు టెండర్లు

మణుగూరు రూరల్ : సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని సింగరేణి వైద్యశాలలో, పీకేఓసీలో ఏసీ అంబులెన్సుల నిర్వహణకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఏరియా డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం తన ఛాంబర్‌లో మాట్లాడుతూ... సింగరేణి ఏరియా ఆస్పత్రి, పీకేఓసీల్లో మూడు ఏసీ అంబులెన్సులు నడపాల్సిన అవసరం ఉందని, నవంబర్ 2 సాయంత్రం 4.30గంటల లోపు టెండర్ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఏరియా పర్చేస్ విభాగంలో సంప్రదించాలని తెలిపారు.

బ్యాంక్ సేవలను వినియోగించుకోండి

కరకగూడెం: ఏపీజీవీబీ గ్రామీణ బ్యాంక్ అందజేస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కరకగూడెం బ్రాంచ్ మేనేజర్ ఎన్.గిరిబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన బుధవారం మండలంలోని కొత్తగూడెం గ్రామంలో గ్రామస్థాయి జనసురక్ష కార్యక్రమం, ఆర్థిక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో ఐకేపీ వీఓఏలు పాయం లక్ష్మీనారాయణ, వెంకన్న, ముత్యాల రమాదేవి, ఎఫ్ఎల్సీ కోఆర్డినేటర్ కొమరం ప్రసాద్ బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్యలో వైద్యశిబిరం

దుమ్ముగూడెం : మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని ఏకలవ్య హాస్టల్‌లో దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పుల్లారెడ్డి, డాక్టర్ నాగరాజుల ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు చేసి రక్తనమూనాలను సేకరించి టీ హబ్‌కు పరీక్షలకు పంపించారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ చైతన్య ఏకలవ్య బాలుర, బాలికల హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. సిబ్బంది ఈశ్వరమ్మ, దుర్గా దేవి, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.







